ప్రజా సేవకులు.. వలంటీర్లు

- సచివాలయ వ్యవస్థలో కీలక పాత్ర
- అర్హులందరికీ పథకాల మంజూరుకు కృషి
- ప్రజల నుంచి మన్ననలు

మద్దిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకు పాలనను చేరువ చేశారు. మునుపెన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు, ఉచిత సేవలు అమలు చేస్తున్నారు. ప్రజా సేవలో వలంటీర్ల పాత్ర ఎంతో కీలకం. ప్రతి నెలా కోడి కూయక ముందే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారు. ఎవరికి ఏ పథకం కావాలో తెలుసుకుని వాటిని మంజూరు చేయిస్తున్నారు. లబ్ధిదారుల వద్దకు ఎప్పటికప్పుడు వెళ్తూ వారి అవసరాలు, యోగాక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు. వైఎస్సార్ చేయూత, చేదోడు, ఆసరా, పింఛన్ కానుక, కాపునేస్తం, వాహన మిత్ర, జగనన్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన మొదలగు పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకుని.. ఒక వేళ అందకపోతే లబ్ధిదారులకు న్యాయం చేసేలా వ్యవహరిస్తున్నారు వలంటీర్లు. ఇలా ప్రతి రోజూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అనేక సౌకర్యాలు కల్పిస్తున్న వలంటీర్లు, వారి సేవలతో అనేక మంది లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఏ పథకం, ఏ సేవ కావాలన్నా.. కార్యాలయాలు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. వృద్ధులు, దివ్యాంగులు నెలనెలా ప్రభుత్వం ఇచ్చే పింఛన్ కోసం సామాజిక భవనాల వద్ద పడిగాపులు కాస్తూ నానా అవస్థలు పడేవారు. రేషన్ డిపోల వద్ద కార్డుదారులు బారులు తీరేవారు. విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరగని రోజంటూ లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజల అవస్థల జాబితా చాలానే ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ఈ పరిస్థితి మార్పునకు తొలి అడుగు పడింది. ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల కష్టాలు తొలగాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా..అవినీతికి తావు లేకుండా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు, సేవలు ఇంటి వద్దకే అందుతున్నాయి. ఇందుకు కారణం ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన సచివాలయం–వలంటీర్ వ్యవస్థ. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వలంటీర్లు సారథుల్లా మారి ప్రజలకు అన్ని రకాల సేవలు అందిస్తున్నారు.


మురళీనగర్ క్లస్టర్-9లో లబ్ధిదారుకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ వేణు (ఫైల్)


క్లస్టర్-11లో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ ఉష (ఫైల్)

50వ వార్డులో సేవలు

జీవీఎంసీ 50వ వార్డులో ప్రజా సేవలో వలంటీర్లు తరిస్తున్నారు. 278, 279 మురళీనగర్ 1, 2 సచివాలయాల్లో క్లస్టర్–9, 11కు సంబంధించి అనేక మంది వలంటీర్లు సేవలందిస్తున్నారు. ఒక్కో వలంటీర్ పరిధిలో 50 ఇళ్లు ఉంటాయి. నిత్యం లబ్ధిదారుల సేవలోనే వలంటీర్లు అందుబాటులో ఉంటూ లబ్ధి చేకూరుస్తున్నారు. ఇలా ప్రతి ఒక్కరికీ అనేక పథకాలు అందుతున్నాయి. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ సొమ్ము అందిస్తూ లబ్ధిదారుల మన్ననలు పొందుతున్నారు. మహమ్మారి కోవిడ్–19 సమయంలో కూడా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వలంటీర్లు లబ్ధిదారులకు పథకాలను అందించారు. ఇంట్లో కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ సేవే మార్గం అన్నట్టు గడిపారు.

అన్ని పథకాలు వచ్చాయి



రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అన్ని పథకాలు మాకు అందాయి, నా భర్తకు పెన్షన్, నాకు వైఎస్సార్ చేయూత డబ్బులు, స్థలం వచ్చింది, డ్వాక్రా రుణమాఫీ ఇలా అన్ని పథకాలు పొందాము, వలంటీర్ ఉష మాతో సఖ్యతగా ఉంటూ ప్రతి విషయాన్ని మాకు చేరవేసి లబ్ధిని అందించారు.

– అప్పన్నమ్మ, కూరగాయల వ్యాపారి, వర్మా కాంప్లెక్స్

అన్ని విధాలా లబ్ధి



నేను కిరాణా షాపు నడుపుతూ జీవిస్తున్నాను. నా భర్త అనారోగ్యంతో ఉన్నప్పుడు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా డయాలసిస్ చేయించారు. అప్పుడు నా భర్తకు పెన్షన్ వచ్చేది. ఇప్పుడు నాకు కూడా పెన్షన్ వస్తుంది. మా పిల్లలకు విద్యా దీవెన అందుతోంది. వలంటీర్ ఉష ప్రతి విషయాన్ని చెప్పి అందుబాటులో ఉంటూ సహకరిస్తున్నారు.

– అచ్చియ్యమ్మ, మురళీనగర్

వలంటీర్ మంచిగా స్పందిస్తారు



నాకు వైఎస్సార్ చేయూత పథకం లబ్ధి చేకూరుతోంది. ఆ డబ్బు కూడా మాకు సరైన సమయానికి రావడం వల్ల కష్టకాలంలో ఆదుకున్నట్టయ్యింది. మా వలంటీర్ వేణు ఎంతో స్నేహభావంతో ఉంటూ ప్రతి విషయాన్ని మాకు సమయానికి చేరవేస్తున్నారు.

– కమల, మురళీనగర్

పెన్షన్ అందుతోంది.. ఇల్లు మంజూరైంది.



నాకు ప్రతి నెలా 1వ తేదీన నిద్రలేవగానే వలంటీరు వచ్చి పింఛను అందిస్తారు. ఇల్లు కూడా మంజూరైంది. వలంటీర్ వేణు సేవలు చాలా బాగున్నాయి. జాప్యం చేయకుండా సమాచారం అందిస్తున్నారు.

– రవిరమేష్, మురళీనగర్

20 మందికి పెన్షన్లు అందిస్తున్నా..



జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ 278 సచివాలయంలో 20 మందికి పింఛన్లు అందిస్తున్నాను. క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు చేయడం, లబ్ధిదారులకు జగనన్న తోడు అలా అన్ని పథకాలు అందేలా చూస్తున్నా. నా క్లస్టర్–11లో లబ్ధిదారులు ఎంతో ఆనందంగా ఉన్నారు.

– ఉష, వలంటీర్, సచివాలయం–278

లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారు



279 సచివాలయంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. నా క్లస్టర్–9 పరిధిలో అనేక పథకాలు అందిస్తున్నాను. నాకున్న 20 రేషన్ కార్డుల్లో పది మందికి లబ్ధి చేకూరేలా చేశాను. మా సేవలపై లబ్ధిదారులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– వేణు, వలంటీర్, సచివాలయం–279

నేడు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

సీతంపేట: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని నిలపాలని నజరేన్ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్, ఆంధ్ర ప్రదేశ్ రాజధాని పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో సంస్థ వ్యవస్థాపకుడు జోసెఫ్ ప్రకాష్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్టు తెలిపారు. మణిపూర్‌లో కులమత బేధాలతో మారణ హోమం సృష్టిస్తున్నా, ప్రజల ఆర్తనాదాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. తక్షణమే ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి స్పందించి అల్లర్లు ఆపేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో జేపీసీ చైర్మన్ అనిల్‌పాల్, పాస్టర్ విల్సన్ బాబు, శ్రీకాంత్ జేమ్స్, డేవిడ్, రాజధాని పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్ తరంగ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జోసెఫ్ ప్రకాష్

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సీతమ్మధార: ఏపీఈపీడీసీఎల్ జోన్–1 డివిజన్ పరిధి 11 కేవీ నక్కవానిపాలెం ఫీడర్‌లో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ,జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, క్రాంతినగర్, కాకతీయ ఫంక్షన్ హాల్, 60 అడుగుల రోడ్డు, శారద స్కూల్ ప్రాంతం, సీ టవర్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

అర్హులందరికీ 'జగనన్న సురక్ష'

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 46, 54, 26 వార్డుల్లో లబ్ధిదారులకు ధ్రువపత్రాల అందజేత


46వ వార్డులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ సతీష్


26వ వార్డులో సర్టిఫికెట్ అందిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ సేవలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పేర్కొన్నారు. 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్ కమ్యూనిటీ హాల్ జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేశామని, ప్రజలు సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసురావాలని కోరారు. కటుమూరి సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కోసం అవసరమైన ధ్రువపత్రాలు పొందేందుకు అర్హులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

46వ వార్డు: 853 సర్టిఫికెట్లు

వార్డులోని 21086257 మధుసూదన్‌నగర్, 258 కస్తూరినగర్, 263 సంజీవయ్య కాలనీ, 264 శాంతి నగర్, 254 లక్ష్మీనారాయణపురం సచివాలయాలకు సంబంధించి ఆయా సర్టిఫికెట్ల నిమిత్తం 983 టోకెన్లు రిజిస్టర్ చేయగా.. 853 సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందజేసినట్లు డిప్యూటీ మేయర్ తెలిపారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, తహసీల్దార్ జయ, డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి, క్యాంప్ స్పెషల్ ఆఫీసర్ శైలజ, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్.అప్పారావు, బి.గోవింద్, చిన్నా, నరసింగరావు, రామారావు, ఎన్.కృష్ణ, శ్రీను, అప్పలరెడ్డి, ఎన్. ఈశ్వరరావు, దుర్గాభవాని, లావణ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


54వ వార్డు: 798 ధ్రువపత్రాలు

జీవీఎంసీ 54వ వార్డు మద్దిపాలెం 104 ఏరియా 300, 307 సచివాలయాల పరిధి జ్యోతినగర్, బీసీ బాయ్ హాస్టల్ ప్రాంతాల్లో కార్పొరేటర్ చల్లా రజనీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించి మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంచి అవకాశంగా భావించి ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సులువుగా అనేక రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులు పొందుతున్నారన్నారు. 995 టోకెన్లు నమోదు కాగా.. 798 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందించినట్లు కార్పొరేటర్ రజని తెలిపారు. జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, తహసీల్దార్ కె.జయ, ఈఈ శ్రీనివాస్ వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, సీనియర్ నాయకులు చిరంజీవి, షేక్ బాబ్జి, రమణమ్మ, అచ్యుతరావు, చల్లా వెంకటేష్, రాధాకృష్ణ, శంకర్, దంతు, శ్రీనివాస్, నాగరాజు, హరినాథ్‌రెడ్డి, అప్పారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు పొందండి

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు శాంతిపురం లాల్ బహదూర్ పార్కు వద్ద జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా ఇంటి వద్ద నుంచే జగనన్న సురక్ష ద్వారా పొందవచ్చన్నారు. నూరు శాతం జగనన్న సురక్ష సేవలను ప్రజలకు చేరవేసే బాధ్యత వలంటీర్లు, సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 26వ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు పోతు సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, డైరెక్టర్ పాండవ శ్రీను, డీటీ త్రినాథరావు, వార్డు నాయకులు శేషు, నవాబ్, అమ్మాజి, బాబ్‌జాన్, గౌస్య, సుశీల, రమాదేవి, పాల్, ప్రకాష్, రోయ్, జి.లక్ష్మి, లలిత, ఫరూఖ్, విజయలక్ష్మి, సంతోష్, వివిధ విభాగాల అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుల, ఆదాయ ధ్రువపత్రాలు పొందాం



నా పిల్లల కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేదు. వలంటీర్ మా ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. జగనన్న సురక్ష క్యాంప్‌లో ఆ సర్టిఫికెట్లను అందజేశారు. చాలా సంతోషంగా ఉంది.

– సీహెచ్ హరిబాబు, సూరిబాబునగర్, 46వ వార్డు

మూడు రోజుల్లోనే క్యాస్ట్ సర్టిఫికెట్



గత వారంలో మా ఇంటికి సచివాలయ సిబ్బంది, వలంటీర్ వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. జగనన్న సురక్ష క్యాంపులో నాకు క్యాస్ట్ సర్టిఫికెట్ అందజేశారు. మూడు రోజుల్లోనే ధ్రువపత్రం పొందడం చాలా ఆనందంగా ఉంది.

– బి.అమృత అక్షయ, కస్తూరినగర్

క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి సహోద్యోగుల ఆర్థిక సాయం


కేశవరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందించి పరామర్శిస్తున్న జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విధి నిర్వహణలో ఇటీవల మరణించిన జీఆర్పీ కానిస్టేబుల్ అడ్డాల కేశవరావు కుటుంబానికి విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. అడ్డాల కేశవరావ(ఆర్పీసీ 986) విధి నిర్వహణలో అకస్మాత్తుగా అస్వస్థతకు గురై జూన్ 26న మరణించాడు. జీఆర్పీలో విధులు నిర్వర్తిస్తున్న సీఐ, పలువురు ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు కలిసి తమ సొంత నిధుల నుంచి రూ.95 వేలు సేకరించి బుధవారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేసి పరామర్శించారు.

తెలుగు సంస్కృతీ వైతాళికుడు 'కొమర్రాజు'

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు శత వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత తెలుగు ఆచార్యుడు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తెలుగు సాంస్కృతిక పునరుజ్జీవనంలో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు పాత్ర శ్లాఘనీయమన్నారు. తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పరిశోధన, వికాసానికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు భాష పరిశోధనకే కాకుండా, తెలుగు శాసనాల పరిశోధకుడిగా విశేషమైన చరిత్ర సమాచారాన్ని లోకానికి కొమర్రాజు అందించారన్నారు. రచయితలు డి.వి.సూర్యారావు, కె.వి.ఎన్.మూర్తి, కొత్తూరి రమణ, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, విరియాల రామచంద్రరావు, కె.రాంప్రసాద్, రామతాత, రాధారాణి పాల్గొన్నారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై ఫిర్యాదు

మద్రిపాలెం: ప్రేమ వివాహం చేసుకుని భార్యను కట్నం కోసం వేధిస్తున్న ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కైలాసపురం కస్తూరినగర్–2లో నివసిస్తున్న భాగ్యరాజు, జ్యోతిర్మయి ఇద్దరూ గతంలో ప్రేమ పెళ్లి చేసుకున్నారు. తన భర్త భాగ్యరాజు తనను కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నాడని భార్య జ్యోతిర్మయి బుధవారం చేసిన ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ రవికిషోర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి అదృశ్యం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసుల తెలిపిన వివరాలిలా.. తెన్నేటినగర్‌కు చెందిన పప్పల లోకాదిత్య మధురవాడలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిప్లమో సెకండియర్ చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే ఈ నెల 10న కాలేజీకి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో తండ్రి పప్పల ప్రసాద్ ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఏఎస్‌ఐ రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: భారీగా పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధార జంక్షన్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన విద్యుత్ సంస్కరణను, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ ప్రజలపై ఆర్థిక భారాలు వేస్తోందన్నారు. విద్యుత్ చార్జీలను రద్దు చేయని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు రావికృష్ణదేవుడు నాయుడు, బి.ఈశ్వరరావు, కె.రాము, రమణ, గణేష్ పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలపై ధ్వజమెత్తిన వలంటీర్లు


49వ వార్డులో వలంటీర్లతో కలిసి మానవహారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మద్రిపాలెం: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఏలూరు సభలో చేసిన అనుచిత వాఖ్యలపై 49వ వార్డు వలంటీర్లు ధ్వజమెత్తారు. తమ మనోభావాలను దెబ్బతీసేలా ఆయన మాట్లాడటం తగదని, వెంటనే బహిరంగా క్షమాపణలు చెప్పాలని మజీదు జంక్షన్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. వలంటీర్ల నిరసనకు వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారన్నారు. ప్రజల కోసం పని చేసే వలంటీర్లపై పవన్ చేసిన వాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ కోడ్‌కు మద్దతు తెలుపుదాం


పాటలు పాడుతున్న ప్రజాగాయకుడు దేవిశ్రీ

సీతంపేట: యూనిఫామ్ సివిల్ కోడ్‌ను స్వాగతిస్తూ జన జాగరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మాట – పాట కార్యక్రమం నిర్వహించారు. ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ పాటలతో అలరించారు. ఈ సందర్భంగా జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ భారత రాజ్యాంగం 44వ అధికరణం సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం మతపరమైన ఆచారాలు, సంప్రదాయాలకు అతీతంగా భారత భూభాగంలో నివసించే పౌరులందరినీ ఒకే చట్ట పరిధిలోకి తీసుకురావడానికి యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్లును తీసుకొచ్చిందన్నారు. దీనికి యావత్ భారతీయులు మద్దతు తెలపాలని కోరారు. బీజేపీపై అక్కసుతోనే కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు యూనిఫామ్ సివిల్ కోడ్‌ను వ్యతిరేకిస్తున్నాయన్నారు. సివిల్ కోడ్ ఏ మతానికి వ్యతిరేకం కాదు, అలాగని అనుకూలం కూడా కాదన్నారు. అన్ని మతాల్లో ఉన్న మంచిని తీసుకుని వివాహం, విడాకులు, వారసత్వం, దత్తతకు సంబంధించి అన్ని మతాలకు సమానంగా ఒకే చట్టాన్ని అమలు చేయడానికి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ధార్మిక సెల్ రాష్ట్ర కో కన్వీనర్ విజయ శంకర్, ఫణీంద్ర, సమితి నాయకులు శ్రీహరి, రామకృష్ణ పాల్గొన్నారు.

గైస్ విద్యార్థినులకు ఏఐసీటీఈ స్కాలర్‌షిప్స్


ప్రిన్సిపాల్ వెంకటరమణతో ఉపకార వేతనాలు పొందిన విద్యార్థినులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థులు ఏఐసీటీఈ ఉపకార వేతనాలకు అర్హత సాధించారు. కాలేజీ ప్రారంభించిన తర్వాత ఈ స్కాలర్‌షిప్స్ పొందడం తొలిసారి కావడం విశేషం. ఫస్టియర్ చదువుతున్న ఏడుగురు విద్యార్థినులు ఉపకార వేతనాలు పొందారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో తర్ఫీదు పొందిన వీరికి మెరిట్‌లో ఈ అవకాశం లభించింది. కెమికల్ విభాగం నుంచి నలుగురు, పెట్రో కెమికల్ నుంచి ముగ్గురు బాలికలు ఎంపికయ్యారు. వీరికి కేంద్ర ప్రభుత్వం ద్వారా మూడేళ్ల పాటు ఏడాదికి రూ.50,000 చొప్పున ఉపకార వేతనం లభిస్తుంది. ఈ సందర్భంగా బుధవారం ప్రిన్సిపాల్ వెంకటరమణ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో నేషనల్ స్కాలర్‌షిప్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పి.కృష్ణారెడ్డి, వివిధ విభాగాధిపతులు డాక్టర్ పీవీ లక్ష్మణరావు, సీహెచ్.జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, డాక్టర్ ఎస్.ప్రశాంత కుమారి పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో పాము కలకలం


పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ సాయి

సీతంపేట: అక్కయ్యపాలెంలోని ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో పాము కనిపించడంతో నివాసులు భయాందోళనలకు గురయ్యారు. 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో జీవీఎంసీ హైస్కూల్ సమీపంలోనిశ కుంతల ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో డస్ట్ బిన్ వెనుక పాము నక్కి ఉన్నట్టు వాచ్‌మేన్ గుర్తించాడు. టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్‌కు తెలియపర్చడంతో స్నేక్ క్యాచర్ ఇమంది సాయికి ఫోన్‌లో సమాచారమిచ్చారు. సుమారు రెండు గంటల పాటు పాము సెల్లార్‌లో హల్‌చల్ చేసింది. స్నేక్ క్యాచర్ పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. అది జెర్రిపోతు అని, అంత ప్రమాదకరం కాదని, ఇది తిరిగే ప్రాంతంలో నాగు పాము ఉండవచ్చని అనుమానంతో స్కూల్ పరిసరాలు వెతికారు. ఏమీ కనిపించలేదు. స్కూల్ పరిసరాలలో పాములు తిరుగుతున్నట్టు స్కూల్ వాచ్‌మ్యాన్, స్కూల్ ఎదురుగా ఉన్న వారు చెబుతున్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకుండా పాములు పట్టి తరలించే ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలకు ఎంతో మేలు


49వ వార్డులో అర్హులకు టోకెన్లు అందిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు అన్నారు. 49వ వార్డులోని 280, 285 సచివాలయాల పరిధిలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి బుధవారం నిర్వహించిన ఇంటింటి సర్వేలో ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. అల్లూరి సీతారామరాజు నగర్‌లో అధికారుల సమక్షంలో అర్హులైన వారి వివరాలు తెలుసుకుని వారిని జగనన్న సురక్షలో గుర్తించి వాలెంటర్ లాగిన్ ద్వారా టోకెన్లు అందించారు. త్వరలో వార్డులో నిర్వహించనున్న జగనన్న సురక్ష క్యాంప్‌నకు హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. రాష్ట్ర భట్టరాజుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్. రవికుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, అడ్మిన్ గిరీష్, వెల్ఫేర్ సెక్రటరీ మహేష్, సిటీ ప్లానింగ్ సెక్రటరీ స్వామి, సచివాలయ కన్వీనర్ వెంకటరావు, నాయకులు ఎర్నిబాబు, గృహసారథులు, ఆర్.వరలక్ష్మి, ఎస్.సంతోష, ఎన్.వెంకటలక్ష్మి, కె.ఉషారాణి, బి.గౌరి, ఎం.వెంకటలక్ష్మి, వలంటీర్లు చైతన్య, ప్రవల్లిక పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ 278, 279 సచివాలయాల్లో జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నెల 17 నుంచి 24 వరకు జరిగే సురక్ష కార్యక్రమంలో కొత్త రైస్ కార్డులు, వాటిలో మార్పులు చేర్పులు చేస్తారని చెప్పారు. ఈ సేవలు అందించడంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంకితభావంతో ఉండాలని కోరారు. 278, 279 సచివాలయ కన్వీనర్లు భరణికాన రామారావు, ఎ.వి.ఎన్.రాజు, చిటికెల శ్రీను, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలకు బాధ్యతగా సేవలు

51వ వార్డులోని 286, 288, 289 సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే ఈ కార్యక్రమంలో సంక్షేమ కార్యక్రమాలు, క్యాస్ట్, ఇన్‌కం, ఫ్యామిలీ మెంబర్‌షిప్ సర్టిఫికెట్లు, మ్యాపింగ్, ఆధార్‌తో మొబైల్ అనుసంధానం చేస్తున్నారని, కొత్త రైస్ కార్డులు, వాటిలో మార్పులు చేర్పులు చేస్తారని తెలిపారు. ఈ సేవలు అందించడంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి బాధ్యతలు తీసుకోవాలని కోరారు. 286 సచివాలయ కన్వీనర్లు దిడ్డి రమేష్, ఎఫ్‌వోఏ టీం ఇన్‌చార్జి రంగా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.